

మహిళల స్వయం ఉపాధే లక్ష్యంగా కుట్టు శిక్షణ

ప్రజాశక్తి - తిరుపతి సిటి



మహిళల స్వయం ఉపాధే లక్ష్యంగా 105 రోజుల పాటు కుట్టు శిక్షణ ఉంటుందని వేమన విజ్ఞాన కేంద్రం గౌరవ సలహా దారు టెంకాయల దామోదరం, జనశిక్షణ సంస్థ డైరెక్టర్ మోహన్ తెలిపారు. బుధవారం నుంచి ఈ శిక్షణ ప్రారంభమయ్యిందని పేర్కొన్నారు. టైలరింగ్ నేర్చుకోవడం వల్ల కుటుంబంలో ఆర్థిక స్థిరత్వం వచ్చి కుటుంబ అభివృద్ధికి కారణం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నడ్డి నారాయణ, తహసున్నీసా, మునిలక్ష్మి, సుధాకర్, ట్రైనర్ సుమతి పాల్గొన్నారు.

తిరుపతి పరిశుభ్రతకు ప్రాధాన్యత : కమిషనర్



స్లమ్ ఏరియాల్లో పొంగి పొర్లుతున్న భూగర్భడ్రైనేజిని పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి నగరంలో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని, పరిసరాలు, కాలువలు, రహదారులు శుభ్రంగా వుంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తూ మనమందరం కషి చేద్దామని మునిసిపల్ కార్పొరేషన్ పారిశుధ్య, ఇంజనీరింగ్ సిబ్బందికి కమిషనర్ అదితిసింగ్ సూచనలు చేసారు. నగరంలోని భవానీ నగర్, రైల్వే కాలనీ, సుందరయ్య నగర్, సప్తగిరి నగర్, యశోదనగర్, మధురా నగర్, ఖాధీ కాలనీ, కేటి రోడ్ ప్రాంతాల్లో బుధవారం ఉదయం కమిషనర్ పర్యటించారు. సామవాయి మార్గంలో స్వీపింగ్ మిషన్ల పనితీరును పరిశీలించి తగు సూచనలు జారీ చేస్తూ స్వీపింగ్ పనులను పూర్తి స్థాయిలో అనుకున్న మేరకు పూర్తి చేసేలా సిబ్బంది పనితీరు వుండాలన్నారు. బ్లిస్ ప్రక్కన మురుగునీరు లీక్ అవుతున్న విషయాన్ని పరిశీలించి, మరమ్మత్తులు వెంటనే చేయాలని, రేణిగుంట రోడ్డు ప్రాంతాల్లో రహదారిపై డ్రైనేజి పైప్ దెబ్బతినడంతో ఆ పరిసరాలు మురుగునీటితో కనిపించడంతో తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసారు. ఉప్పంగి హరిజన వాడ, భవాని నగర్ ప్రాంతాల్లో డ్రైనేజి మూతలను తీయించి మురుగు నీరు సక్రమంగా పారుతున్నదా అని కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ అదితిసింగ్ అధికారులకు సూచనలు ఇస్తూ తిరుపతిని అన్ని విధాలా తీర్చిదిద్దాలని, ముఖ్యంగా పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, డ్రైనేజి మరమ్మత్తులను, కాలువల్లో సిల్ట్ తీయించే ప్రక్రియ నిరంతరం చేపట్టాలని, తాగునీటి పైప్ లైన్లలో మురుగు నీరు కలవకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డయేరియా, మలేరియా, డెంగీ ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, బ్లీచింగ్ చల్లించడం, క్లోరినేషన్ ప్రక్రియలో జాగ్రత్తలు తీసుకొని పనులు చేపట్టడం చేయాలని, అదేవిధంగా మురికి నీరు సాఫీగా వెళ్లేందుకు నిరంతరం పర్యవేక్షిస్తూ కాలువలపై ఆక్రమణలు తొలగించాలని, తిరుపతి పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, మునిసిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, డిఈ శ్రావణి, శానిటరి సూపర్ వైజర్లు చెంచెయ్య, సుమతి పాల్గొన్నారు.

ఘనంగా 'శ్రీజ'వార్షికోత్సవం

ప్రజాశక్తి -తిరుపతి (మంగళం)



శ్రీజ పాల డెయిరీ పదో వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బాలాజీ డెయిరీ సమీపంలోని జిఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి డిఎహెచ్‌డి అదనపు కార్యదర్శి వర్షా జోషి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునిక పాడి పద్ధతులను అవలంబించడం, పాడి పరిశ్రమలో మహిళల భాగస్వామ్యం పెరగడం వల్ల ఆంధ్రప్రదేశ్ లో పాల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందన్నారు. తిరుపతిలో నేడు 1.20 లక్షల మంది సభ్యులతో కూడిన ప్రపంచంలోనే అతిపెద్ద మహిళా యాజమాన్యంలోని పాల ఉత్పత్తి సంస్థ శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ 10వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ సంస్థ రోజుకు 8 లక్షల లీటర్ల పాలను సేకరిస్తుంది. ఇటీవలి సంవత్సరాలలో పాల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ గణనీయమైన పురోగతిని సాధించిందని, శ్రీజ వంటి సంస్థలు దీనిలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని జోషి అన్నారు. పాల ఉత్పత్తిలో రాష్ట్రం ప్రస్తుతం దేశంలో 5వ స్థానంలో ఉందని, మొదటి 3 లో ఒకటిగా నిలవాలని లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. పశు సంవర్ధక శాఖ గణాంకాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లో పాల ఉత్పత్తి 2014-15లో 96.56 లక్షల టన్నులు ఉండగా, 60శాతం వద్ధితో 2022-23 నాటికి 1.54 కోట్ల టన్నులకు పెరిగిందన్నారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళా-పాడి రైతులను ఉద్దేశించి నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ డెయిరీ సర్వీసెస్ చైర్మన్ డాక్టర్ మీనేష్ షా మాట్లాడుతూ శ్రీజ పాల డెయిరి పదేళ్లు పూర్తి చేసుకున్నందుకు, ఆ మార్గంలో అనేక మైలురాళ్లను సాధించినందుకు రైతులను అభినందించారు. పూర్వపు చిత్తూరు జిల్లా కోఆపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ యూనియన్ లిమిటెడ్‌లోని మిల్క్‌షెడ్ ప్రాంతంలో కార్యకలాపాలు శ్రీజ ప్రారంభించిందని, ఆ తర్వాత పొరుగు రాష్ట్రాలతో సహా పన్నెండు జిల్లాలకు విస్తరించిందని డాక్టర్ షా పేర్కొన్నారు. ప్రస్తుతం చిత్తూరు, అనంతపురం, తమిళనాడు, కర్ణాటక సరిహద్దులో ఉన్న పరిసర ప్రాంతాలలో శ్రీజ పాల ఉత్పత్తిదారులకు సేవలు అందిస్తోందన్నారు. మహిళలతో నడుస్తున్న ఈ సంస్థ మరింత వద్ధి చెందాలని అభిలషించారు.



నేడు కలెక్టర్ వెంకటేశ్వర్లు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతి జిల్లా నూతన కలెక్టర్‌గా నియమితులైన డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లుకు రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ధ్యానచంద్ర స్వాగతం పలికారు. అలాగే డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి కలెక్టరేట్‌లో బొకే అందించారు. గురువారం తిరుమల శ్రీవారి సన్నిధిలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

శ్రీ పద్మావతి జూనియర్ కళాశాలలో ముగిసిన అడ్మిషన్ల ప్రక్రియ

ప్రజాశక్తి - క్యాంపస్

2024 -25 విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి గాను శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల ప్రవేశాల ప్రక్రియలో భాగంగా అన్ని గ్రూపుల్లో కాలేజ్, హాస్టల్ సీట్లు పూర్తిస్థాయిలో ముగిసినవని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. భువనేశ్వరి పత్రికా ప్రకటనలో వెలువరించారు. మొదటి మూడు విడతల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్, మెరిట్ ప్రాతిపదికన నిర్వహించి, తదుపరి మిగిలిన కళాశాల సీట్లను స్పాట్ కౌన్సిలింగ్ ద్వారా, ముందుగా తిరుపతి స్థానిక విద్యార్థులకు, స్థానికేతర విద్యార్థులకు పదవ తరగతి మార్కుల ప్రాధాన్యత ప్రాతిపదికన చేశారు. ప్రవేశాల ప్రక్రియకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.



అన్నదానానికి రూ.2.50లక్షల విరాళం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాదుకు చెందిన రామకష్ణరావు, మధుకుమారి అనే భక్తులు ఇటీవల రూ.2.50 లక్షలు విరాళంగా అందించారు. ఆలయ అధికారులు ఈ విరాళం స్వీకరించారు. దాతలకు కతజ్ఞతలు తెలియచేసి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత లక్కమనేని మధుబాబు, ఏఈవో సతీష్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌వి ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ ప్రవేశాలకు ఆహ్వానం

ప్రజాశక్తి - క్యాంపస్

టీ టీ డి ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్ వి ఆర్ట్స్ కాలేజీలో నాలుగు సంవత్సరాల హానర్స్ డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులు కోరడమైనది. ఓఏఎండిసి వెబ్సైట్ ద్వారా ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలి. కాలేజీ కోడ్ 20132 బిఏ కోర్స్ లో ఇంగ్లీష్, తెలుగు, పాలిటిక్స్, ఎకనామిక్స్, హిస్టరీ, బీకామ్ జనరల్, బీకామ్ సి ఏ, బిఎస్సీ కంప్యూటర్ సైన్స్, ఆక్వా కల్చర్, మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, సైకాలజీ, ఫిజిక్స్, మైక్రోబయాలజీ, బయో టెక్నాలజీ, ఎలక్ట్రానిక్, బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, డేటా సైన్స్ తదితర గ్రూపులు అందుబాటులో ఉన్నాయి. మెరిట్ ఆధారంగా ఉచిత హాస్టల్ వసతి కల్పించబడుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

తిరుపతిలో షాడో ఎంఎల్ఎ : సిపిఐ

తిరుపతి సిటి : తిరుపతి ఎంఎల్ఏ ఎవరు ఆరణి శ్రీనివాసులు కాదా? అని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి అనుమానం వ్యక్తం చేశారు. తిరుపతి కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ పక్కన కూర్చుని అధికారులు ఎలా పనిచేయాలో షాడో ఎంఎల్ఏ ఆరణి శివకుమార్ చెప్పడం ఏంటని ప్రశ్నించారు. తిరుపతి నగర ప్రజలు గమనించాలన్నారు. బదిలీల్లో ఎంఎల్ఏ బిజీగా ఉండటం వల్లనే అన్న కుమారుడు అన్నీ తానై కానిచ్చేస్తున్నాడని ఆరోపించారు. కమిషనర్ సైతం షాడో ఎంఎల్ఏ సమీక్షను బుద్ధిగా తల ఊపుతూ వినడం విచిత్రంగా ఉందన్నారు.

తిరుమలలో సైబర్ క్రైం టీం ఏర్పాటుకు పరిశీలన : ఈవో

ప్రజాశక్తి - తిరుపతి సిటి



తిరుమల శ్రీవారి భక్తులను మోసగిస్తున్న దళారులను కనిపెట్టి ఎప్పటికప్పుడు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా టీటీడీ ఈవో జె.శ్యామలరావు జిల్లా ఎస్పీని కోరారు. తిరుపతి టీటీడీ పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో బుధవారం ఉదయం జిల్లా పోలీస్, టీటీడీ నిఘా, భద్రత విభాగం అధికారులతో ఈవో సమావేశం నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసే వేలాది మంది భక్తులకు అవసరమైన వసతి, దర్శనం, ఆర్జితసేవ టికెట్లకు సంబంధించి భక్తులను మోసగిస్తున్న అనేకమంది దళారులను ఉపేక్షించరాదన్నారు. వారిపై వెంట వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సివిఎస్ఓ వివరించిన ఆవశ్యకత మేరకు తిరుమలలో ఐటి అనుబంధంగా ఉన్న కేసులను సత్వరం పరిష్కరించేందుకు సైబర్ క్రైమ్ టీం ఏర్పాటు పరిశీలించవలసిందిగా సంబంధిత అధికారులకు ఈవో సూచించారు. అంతకుముందు పోలీస్ విభాగం వారు తిరుమలలో దర్శన దళారులకు సంబంధించి, ఆన్లైన్ ద్వారా, డిప్ సిస్టం ద్వారా, రిజిస్ట్రేషన్ చేసుకున్న కేసులు, దొంగతనం కేసులు, మద్యపానం, నకిలీ వెబ్సైట్లు, తదితర అంశాలకు సంబంధించిన కేసులు ఏఏ దశల్లో ఉన్నాయో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఈవో మాట్లాడుతూ మరో వారంలోపు ఈ కేసుల్లో ఉన్న దళారులకు చట్టపరంగా తగు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీస్ అధికారులను కోరారు. అంతేకాకుండా ఇటువంటి కేసుల సత్వర పరిష్కారం కోసం టీటీడీ విజిలెన్స్, పోలీస్ విభాగాలు తరచూ సమావేశం కావాలన్నారు. ఈ సమావేశంలో తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, టీటీడీ జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సివి అండ్ ఎస్ఓ నరసింహ కిషోర్, తిరుమల అదనపు ఎస్పీ విమల కుమారి, డిఎస్పి శ్రీనివాస ఆచారి, టీటీడీ విజివో (విజిలెన్స్) గిరిధర్ పాల్గొన్నారు.

మాజీ ఎంఎల్ఏ స్వార్థానికి ప్రజాధనం వృథా



నిర్మించిన కొద్ది రోజులకే కుంగిపోయిన రహదారి

తిరుపతి సిటి : మాస్టర్ ప్లాన్ రోడ్లతోపాటు టిడిఆర్ బాండ్ల రూపేణ మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ప్రజాధనాన్ని దోచుకున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆరోపించారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల నాణ్యతపై థర్డ్ పార్టీ పరిశీలన తరువాతే డబ్బు చెల్లించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కుళశేఖర్ ఆళ్వార్ మార్గాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. కుళశేఖర్ ఆళ్వార్ మార్గం కుంగిపోవడంతోపాటు అండర్ గ్రౌండ్ కేబుల్స్ కోసం అవసరానికి మించి రోడ్డును తొవ్వేసిన తీరును ఆయన చూశారు. ఏడు కోట్ల రూపాయలతో ఈ రోడ్డును నిర్మించినట్లు ఎస్ఈ మోహన్ ఎమ్మెల్యే దష్టికి తీసుకొచ్చారు. ఎస్పీడీసీఎల్ ఈఈ దామోదర్ మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ కేబుల్స్ కోసం రోడ్డును తవ్వడంతో కుంగిందని చెప్పారు. ప్రజలకు కలిగిన అసౌకర్యాన్ని దష్టిలో పెట్టుకుని త్వరగా మరమ్మత్తులు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నరసింహ యాదవ్, టిడిపి కార్పోరేటర్ ఆర్సీ మునికష్ణ, చినబాబు, బిజి కష్ణ యాదవ్ పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ : ఎస్‌పి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



గంజాయి నిర్మూలనకు పోలీసులు ప్రత్యేక కార్యచరణ చేపట్టారని, మత్తు పదార్థాలు నిషేధ వస్తువుల అక్రమ రవాణా చట్టం విరుద్ధమని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శాంతి భద్రతల అదనపు ఎస్పీ కులశేఖర్ ఆధ్వర్యంలో జిల్లా స్పెషల్ పార్టీ పోలీసులతో రెండు ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసి, జిల్లా వ్యాప్తంగా విస్తతంగా రైడ్‌లను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న పార్సెల్ సర్వీస్, లగేజ్ ట్రాన్స్పోర్ట్, కొరియర్ సర్వీస్ ఆఫీసులను ముమ్మరంగా తనిఖీ చేశారు. తిరుపతి నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ కొరియర్ సర్వీసులు, రైల్వే స్టేషన్ పార్సెల్ సర్వీసులు, నవత, భారత్ మోటర్ పార్సల్ సర్వీసు, పలు కొరియర్ సర్వీసుల స్టాక్ పాయింట్లు, రేణిగుంట వద్ద గల స్టాక్ పాయింట్స్, నవత, భారత్ మోటర్ పార్సెల్ సర్వీసులను తనిఖీ చేశారు. అనుమానిత పార్సిల్ లను, కొరియర్లను పరిశీలించారు. అక్రమంగా తరలిస్తున్న సుమారు 16 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బి డిఎస్పి వెంకటాద్రి, గాజులమండ్యం సిఐ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లలో ఎస్పీ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - రామచంద్రాపురం

తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు చంద్రగిరి, పాకాల పోలీస్ స్టేషనులను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చంద్రగిరి పోలీస్ స్టేషన్ సిఐతో మాట్లాడుతూ శాంతిభద్రత సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదు దారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. పోలీసులు ప్రవర్తించే తీరు పోలీసులపై గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలన్నారు. శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కల్గిస్తే అలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. రికార్డులను పరిశీలించారు. గ్రామస్థాయిలో నిఘా వ్యవస్థ పటిష్టం చేయాలని ఆదేశించారు. నూతన చట్టాల పై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు రామయ్య చంద్రగిరి, శ్రీరాములు పాకాల పాల్గొన్నారు.

స్టాప్ డయేరియాపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



డయేరియా విస్తరించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ మంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపిహెచ్ ఈఓ మురళి ఆధ్వర్యంలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్ ర్యాలీని నిర్వహించారు. మంగళం పరిధిలోని ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో గల ప్రజా నివాస ప్రాంతాలలో ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు డయేరియా నివారణకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను, జింకు టాబ్లెట్లను అందజేశామన్నారు. నీటి సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంకులు, గ్రౌండ్ వాటర్ ట్యాంకులను శుభ్రపరచి క్లోరినేషన్ చేయాలన్నారు. జూలై 1 నుండి ఆగస్టు ఏడో తేదీ వరకు ఈ స్టాప్ డయేరియా క్యాంపెయిన్ సాగుతుందని తెలిపారు. అవగాహన కార్యక్రమంలో పీహెచ్ఎన్ తాస్కెంట్ పాల్గొన్నారు.

దళిత గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - డక్కిలి



వెంకటగిరి నియోజక వర్గంలో దళిత గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితకు ఎపి ప్రజాసంఘాల అధ్యక్షులు గద్దల మునెయ్య, మాదిగ ఉద్యోగుల సమైక్య తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి దూడల పెంచలయ్యలు వెలగపూడి సచివాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఎస్సీ వర్గీకరణ జరిగే రోజులు దగ్గరలో ఉన్నాయని, ఇటీవల సిఎం చంద్రబాబునాయుడు కుప్పంకు వచ్చినపుడు ఎస్సీ వర్గీకరణ ఎబిసిడి తప్పకుండా చేస్తానని హామీ ఇచ్చారని, అప్పటివరకూ డిఎస్‌సి నోటిఫికేషన్ నిలుపుదల చేయాలని తెలిపారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

ప్రజాశక్తి- డక్కిలి

తెలుగుగంగ కాల్వ పరీవాహక ప్రాంతాల రైతులు అప్రమత్తంగా ఉండాలని డక్కిలి ఎస్ఐ చౌడయ్య తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్లో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం తెలుగుగంగ కాలువలో నీరు లేక పోవడంతో కాలువ కింద భాగంలో ఉన్న పొలాల రైతులు అందరూ వారికి సంబంధించిన మోటార్లును జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. మోటార్లు చోరీకి గురి కాకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. పంటలు సాగు చేసేటప్పుడు మాత్రమే మోటార్లును అమర్చుకోవాలని చెప్పారు. అదే విధంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో హుండీలపై గ్రామ ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. హుండీల్లో ఉన్న నగదును భద్రపరుచుకోవాలని తెలియజేశారు. ఇటీవల ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భారతీయ నాగరిక్ సురక్ష్, భారత సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అదినీయమ్ వంటి చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.



పెట్లూరులో సిపిఎం పోరాట ఫలితంగా జాయింట్ సర్వే

సర్వే రాయి కోసం వెతుకులాట

ప్రజాశక్తి వెంకటగిరి రూరల్

మూడు రోజులుగా మండల సర్వేయర్, ఫారెస్ట్ అధికారులు సర్వే రాయి కోసం వెతుకులాట ప్రారంభించారు. జంగాలపల్లి నుండి సిద్ధగుంట పెట్లూరు పంచాయతీ వరకు 12వ సర్వే నెంబరు రిజర్వ్ ఫారెస్ట్ భూమి లేక మీ భూమిలో ఉన్నట్లు మేత పోరంబోక తెలియడానికి గాలింపు చర్యలు చేపట్టారు. వివరాల్లోకెళ్తే ...తిరుపతి జిల్లా వెంకటగిరి మండలంలోని పెట్లూరు గ్రామ సర్వేనెంబర్ 12 ను కనిపెట్టడానికి జాయింట్ సర్వే గత మూడు రోజులుగా మండల సర్వేయర్ సుప్రజ, ఫారెస్ట్ సిబ్బంది నిర్వహిస్తున్నారు. ఎంతోకాలంగా పేదవాళ్లు సాగు చేసుకుంటూ గుడిసెలు నిర్మించుకుని ఉంటున్న భూమి రిజర్వు ఫారెస్టుదంటూ కొంతకాలంగా పేదలపై దౌర్జన్యం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జాయింట్ సర్వే చేయాలని సిపిఎం డిమాండ్ చేయడంతో ఎట్టకేలకు సర్వేకు ఉపక్రమించారు. గూగుల్ మ్యాప్ ఇన్ పాయింట్స్ పెట్టుకుంటూ రాయి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. త్వరగా జాయింట్ సర్వే పూర్తి చేసి పేదలకు న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి చెంగయ్య విజ్ఞప్తి చేశారు. పేదలు జానెడు స్థలంలో సాగు చేసుకుంటూ, గుడిసెలు వేసుకుని దీర్ఘకాలికంగా ఉంటుంటే ప్రభుత్వ కక్షసాధింపు చర్యలు ఏంటని ప్రశ్నించారు. పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జాయింట్ సర్వేలో మండల లైసెన్స్ సర్వేయర్ చలపతి, సిపిఎం నాయకులు రమణయ్య, ఎర్రయ్య పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో పసికందు మృతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్



ఘటనపై డిఎంహెచ్ఓ వివరణ

ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యం వల్ల పసికందు మృతిచెందిందని తల్లిదండ్రులు వాపోతున్నారు. కార్వేటినగరం మండలం సురేంద్రనగరం గ్రామానికి చెందిన నరేష్ భార్య పూర్ణిమ రెండు రోజుల క్రితం పురిటినొప్పులతో ఆస్పత్రిలో చేరింది. మగబిడ్డకు జన్మనిచ్చింది. బిడ్డ ఆరోగ్యంగా పుట్టిందని, అయితే వైద్యులు సక్రమంగా చూడకపోవడం వల్లనే ఊపిరితిత్తుల్లో పాలు చేరిపోయి మృతిచెందిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వైద్యులకు చెప్పినా రాత్రుల్లో స్పందించలేదని వాపోయారు. పసికందు మృతిపై జిల్లా వైద్యాధికారి శ్రీహరి, జిల్లా ఉప వైద్యాధికారి మురళీకృష్ణ స్పందిస్తూ తల్లిదండ్రులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విచారించి చర్యలు చేపడతామని తెలిపారు. కార్వేటినగరం తహశీల్దార్ పుష్పలత, డిప్యూటీ తహశీల్దార్ స్వరూప, పుత్తూరు పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడుతో కలిసి ఆస్పత్రిలో పరిశీలించారు.

చెత్తను శుభ్రం చేయండి సారూ...

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

చెత్తను శుభ్రం చేసి తమ ఆరోగ్యాలను కాపాడాలని మంగళం పంచాయతీ ప్రజలు వేడుకొంటున్నారు.. అసలే తొలకరి జల్లులు పడుతూ సీజనల్ వ్యాధులు వ్యాపించే పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో మంగళం పంచాయతీ పాలకులు ప్రజల ఆరోగ్యం పట్ల పరిహాసం ఆడుతున్నారు. గుట్టల కొద్దీ చెత్త వారాలుగా రోడ్డుపై తిష్టవేసుంటే దాన్ని శుభ్రం చేయకుండా కాలయాపన చేయడంతో స్థానిక ప్రజలు పెదవి విరుస్తున్నారు. విష జ్వరాలు వ్యాప్తి చెందుతాయని ఆరోగ్య శాఖ హెచ్చరికలు చేస్తున్న నేపథ్యంలోనూ పంచాయతీ పాలకులు అలసత్వం ప్రదర్శించడంతో స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పరిస్థితి. రవాణా శాఖ కూడలి నుండి బి టి ఆర్ కాలనీ ఒకటో లైన్ కు వెళ్లే మార్గంలో మంగళం గ్రామపంచాయతీకి సంబంధించిన చెత్తకుండీ నిండి వారాలు గడుస్తోంది. ఇక్కడ పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహించే రాజేష్‌ను అధికారులు తప్పించారు. ఆయన స్థానంలో ఇప్పటివరకు ఎవరినీ నియమించలేదు. సచివాలయ కార్యదర్శి అయిన పట్టించుకుంటారంటే ఆ ఊసే లేదు. ఇటీవల జరిగిన గ్రామసభలో సైతం కుక్కల బెడద, చెత్త సమస్యలపై ప్రజలు సభలో వినతులు ఇచ్చినా ఫలితం కనబడకపోవడం ప్రజల ఆరోగ్యం పట్ల అధికారులకున్న నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేస్తోంది. ఇకనైనా పంచాయతీ పాలకులు చెత్తను శుభ్రం చేసి ప్రజల ఆరోగ్యం పట్ల తమకున్న బాధ్యత చాటుకుంటారో లేదో వేచి చూడాలి.



వారాల కొద్దీ రోడ్డుపై నిల్వ ఉండి కంపు కొడుతున్న చెత్త

డీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తిరుపతిలోని బీసీ స్టడీ సర్కిల్‌లో డిఎస్సీ పరీక్షలు రాసే వారికి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఎస్. చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ శిక్షణకు బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన వారు అర్హులని ఆయన పేర్కొన్నారు. ఈ కులాలకు చెందిన వారు ఈ నెల 3నుంచి 10వ తేదీ సాయంత్రం 5గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇక్కడ 200మంది అభ్యర్థులకు ఈ నెల 15వ తేదీ నుంచి 60రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందచేస్తామన్నారు. బీఈడీ లేదా డీఎడ్ పరీక్షల్లో ఉత్తీర్ణత పొంది, టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) లో అర్హత సాధించిన వారు తమ బయోడేటాతో పాట. తమ ప్రొవిజనల్ సర్టిఫికెట్, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితాలు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు (సంవత్సర ఆదాయం రూ.లక్ష లోపు) ఆధార్, బ్యాంకు పాసు పుస్తకం, మూడు పాస్ పోర్టు సైజు ఫోటోలు జతపరచి ఈ నెల 10వ తేదీ లోపు దరఖాస్తులు అందచేయాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు 9346221553, 9490733351, 9441456039 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

> మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఇశ్రాయేల్ కుమార్

ప్రజాశక్తి-గూడూరు టౌన్: విద్యార్థులు ఇష్టపడి చదివి, తమ లక్ష్యాన్ని చేరుకోవాలని మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఇశ్రాయేల్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం గూడూరు రెండో పట్టణంలోని జానకి రామ్‌పేటలో ఉన్న పురపాలక ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్‌ను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఇశ్రాయేల్ కుమార్ హాజరైయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం ఉండే లక్ష్యన్ని ఎంచుకొని, లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయమ్మ, టిడిపి నాయకులు పురుషోత్తం, మల్లి, కళ్యాణ్ బాబు, వినయ్ కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం ఆవిర్భావ వేడుకల్లో భాగంగా బుధవారం స్థానిక ఎల్ఐసి కార్యాలయ ఆవరణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. హెర్బల్ ఆయుర్వేదిక్ డాక్టర్ చంద్రశేఖర్, తిరుమురుగన్, వారి ద్వారా జపాన్ టెక్నాలజీ నేతృత్వం వహించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ హేమాద్రి, యూనియన్ అధ్యక్షులు దస్తగిరి, కార్యదర్శి లక్ష్మణ్ కుమార్, యూనియన్ నాయకులు గణేష్ బాబు, వేలాయుధం పాల్గొన్నారు.

'బాలికల చదువు దేశానికి వెలుగు'

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: క్రై పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న 'పూరి పఢై దేశ్‌కి భలై' కార్యక్రమంలో భాగంగా ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పేడు మండలంలోని పల్లం స్కూల్‌లో 39మంది బాలికలను స్కూల్లో చేర్పించారు. కార్యక్రమంలో ఎంఈవో దయాకర్ మాట్లాడుతూ తల్లిదండ్రులకు ఆడపిల్లల చదువుని విశిష్టతను తెలిపి, కనీసం ఇంటర్మీడియట్ వరకు చదువు ఎంత అవసరమో అవగాహన కల్పించారు. స్కూల్ హెడ్మాస్టర్, టీచర్లు ఆడపిల్లల చదువు దేశానికి, దేశ అభివృద్ధికి ఎలా తోడ్పడుతుందో వివరించారు. కార్యక్రమంలో ప్రగతి సిబ్బంది శిరీష తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని మేర్లపాక ఎంపీపీ స్కూల్‌లో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి నేతృత్వంలో విద్యా సామగ్రి కిట్లును విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో మునిరెడ్డి, కృష్ణవేణి, రమణ, నరసింహనాయుడు, భాస్కర్‌నాయుడు, శివారెడ్డి, సదా శంకర్, వెంకటస్వామి, మురళి, ప్రదీప్, లోకేష్ పాల్గొన్నారు.

తంగేళ్లపాలెం సింగిల్ విండో పర్సన్ ఇన్‌ఛార్జ్‌గా రవిబాబు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తంగేళ్లపాలెం సింగిల్ విండో సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జ్‌గా శ్రీకాళహస్తి సబ్-డివిజనల్ కో-ఆపరేటివ్ కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి.రవిబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సింగిల్ విండో త్రీమెన్ కమిటీ ఛైర్మన్‌గా ఉన్న మణిబాబు నాయుడు వైసీపీ ప్రభుత్వం మారడంతో గత నెల 9వ తేదీన తన పదవికి రాజీనామా చేశారు. దీంతో సింగిల్ విండో సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జ్‌గా రవిబాబును నియమించారు. ఈయన్ని కార్యాలయ సీఈవో చిరంజీవిరెడ్డి, సిబ్బంది అభినందించారు. రైతులకు పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, ఎరువులు సకాలంలో అందిస్తామని రవిబాబు ఈ సందర్భంగా తెలిపారు.

టెండర్ల ఆహ్వానం

ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్‌పిఎంవివి సొసైటీ ఫార్ ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఎస్ఎస్ఐఐఇ) - టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎఫ్ఏబి ల్యాబ్ సరఫరా, ఇన్‌స్టాలేషన్ పరికరాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ నుంచి ఓ ప్రకటన విడుదలైంది. 5వ తేదీ నుంచి 29వరకు అందుబాటులో టెండరు సమర్పించాల్సి ఉంటుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

'అర్హులందరికీ పింఛన్'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అర్హులైన ప్రతి వ్యక్తికి పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని బొజ్జల బృందమ్మ హామీ ఇచ్చారు. బుధవారం ఆమె స్థానిక జయరాం రావు వీధికి వెళ్లి పెన్షన్ లబ్దిదారులతో ముఖాముఖి అయ్యారు. నాడు-నేడుకు తేడా తెలిసిందన్నారు. మాజీ కౌన్సిలర్ డాక్టర్ నివేదిత మోరె, టీడీపీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఉమేష్ రావు, నెమళ్ళూరు బుజ్జి, మహబూబ్ బాషా, వంశీ, శేషు, శివ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కరకంబట్టు గ్రామానికి చెందిన గునకలమున్నెయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులకు కంచనపుత్తూరు గరుడ గ్రూపు సభ్యులు రూ.20వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు.

104 సేవలు వినియోగించుకోండి: డాక్టర్ శివకృష్ణారెడ్డి



ప్రజాశక్తి-వెంకటగిరి రూరల్: మండలంలోని పాలెంకోట పంచాయతీలో 104 వైద్య సేవలను బుధవారం బంగారుపేట పీహెచ్‌సీ డాక్టర్ శివకృష్ణారెడ్డి అందించారు. ప్రతినెల మొదటి బుధవారం 104 మొబైల్ సేవలను పేద ప్రజలకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అందిస్తున్నామని ఆయన అన్నారు. నెలనెలా దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నటువంటి రోగులు విధిగా వచ్చి షుగరు, బిపి, కొలెస్ట్రాక్ట్ ఉచితంగా పంపిణీ చేస్తున్న మందులు క్రమం తప్పక వాడుకోవాలని సూచించారు. చిన్న పిల్లల టీకాలు, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ రాసి, ఏఎన్ఎం శోభన, ఆశా వర్కర్ అరుణ, డ్రైవర్ వెంకటేష్, డీఈవో మురళి పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ



ఆసుపత్రిలో తనిఖీ చేస్తున్న జిల్లా అధికారి శాంతికుమారి

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: పుత్తూరు రూరల్ మండలం పరమేశ్వర మంగళం పంచాయతీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి డాక్టర్ శాంతి కుమారి అకస్మాత్తుగా తనిఖీ చేశారు. స్టాఫ్ డయేరియా కార్యక్రమంపై అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పిహెచ్సిలో ఉంచిన ఓఆర్ఎస్, కార్నిలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమాలను పరమేశ్వరం మంగళంలో తనిఖీ చేసి వాక్సినేషన్ వివిఎం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ సాయి చందర్, జుబీర్, ఆరోగ్య విస్తరణ అధికారి, రమేష్ బాబు, పీహెచ్ఎన్ విజయకుమారి, సెక్షన్ సూపర్వైజర్ మురళి, పీహెచ్ సిబ్బందులు పాల్గొన్నారు.

అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్‌లు, జెసీబీ సీజ్

ప్రజాశక్తి-దొరవారిసత్రం: మండలంలోని నెలబల్లి చెరువులో అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న నాలుగు ట్రాక్టర్లు, జెసీబీని బుధవారం పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ తిరుమల రావు వివరాల మేరకు.. ముందస్తు అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో నెలబల్లి చెరువు వద్ద దాడులు నిర్వహించామన్నారు. నాలుగు ట్రాక్టర్లు, జెసీబీని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని అక్కుర్తి పంచాయతీ రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి శ్రీకాళహస్తి రూరల్ పోలీసుల కథనం మేరకు.. అక్కుర్తి పంచాయతీ రైల్వే ట్రాక్ మార్గంలో ఉన్న నివాస ప్రాంతాల చివరిలో మంగళవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో ఒక వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటం గమనించిన గ్రామస్తులు వెంటనే108 సమాచారం అందించడంతో 108 సహకారంతో ఆ వ్యక్తిని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందినట్లుగా నిర్ధారించారని తెలిపారు. డీఎస్పీ ఉమామహేశ్వర్ రెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు. మృతినికి సంబంధించి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

నవోదయ ఫలితాల్లో విశ్వం విద్యార్థుల ప్రభంజనం



ప్రజాశక్తి-క్యాంపస్: 2024-2025 విద్యా సంవత్సరానికి జరిగిన జవహర్ నవోదయ విద్యాలయ 6వ తరగతి రెండవ జాబితా ప్రవేశ పరీక్ష ఫలితాల్లో విశ్వం విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. జీ.జే.యశ్విన్ కుమార్, బేరి భారత్, ఎన్.మోహిత్, ఎన్.వంశితశ్రీలు సీట్లు సాధించి విజయభేరి మోగించారు. వీరితో పాటు 52మంది విశ్వం విద్యార్థులు సీట్లు సాధించారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ యన్.విశ్వనాథ రెడ్డి తెలిపారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ యన్.విశ్వ చందన్ రెడ్డి, కరస్పాండెంట్ యన్.తులసీ విశ్వనాథ్‌లు అభినందించారు.

ఒలంపియాడ్ పరీక్షల్లో ఎంజీఎం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఒలంపియాడ్ పరీక్షల్లో ఎంజీఎం పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. వి.ధరణి, బి.నిఖిల్, రవిసాయి, లిఖిత్ కుమార్ అనే విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో టాపర్స్‌గా నిలిచారు. ఇక ఆరు మంది విద్యార్థులు ఎక్సలెన్స్ పతకం సాధించారు. 36మంది మొదటి శ్రేణి, 16మంది ద్వితీయ శ్రేణి, 16మంది తృతీయశ్రేణి సాదించారు. ఈ విద్యార్థులకు ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ నుంచి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. అంతే కాకుండా 2023-24విద్యాసంవత్సరానికి ఎంజీఎం పాఠశాల గోల్డెన్ స్కూల్ అవార్డుగా నామినేటెడ్ అయింది. ఒలంపియాడ్ పరీక్షల్లో



విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల డైరెక్టరు గుడ్లూరు మయూర్ అభినందించారు. కార్యక్రమంలో ఎంజీఎం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునిరత్నంనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

> ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయ అవరణంలో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, చెప్పులు, కొబ్బరి నూనె, సబ్బులు, గ్లౌజులు, తదితర వస్తువులను అందచేశారు. ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు రాత్రనక పగలనక ప్రజలకోసం సేవలు అందిస్తున్నారన్నారు. కార్మికులకు ఎంత చేసినా తక్కువేనని పేర్కొన్నారు. కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. స్వచ్ఛ గూడూరుకి సహకరించాలని కార్మికులను విజ్ఞప్తి చేశారు. గత పాలకుల నిర్లక్ష్యం వలన గూడూరు



మున్సిపాలిటీ పరిశుభ్రత కుంటుపడిపోయింది అన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, కిరణ్‌కుమార్, నాగరాజు, శివకుమార్, చాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు స్థానిక సర్పంచ్ బూదూరు వెంకటమ్మ అన్నారు. బుధవారం పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొని ఉన్న సమ్యస్యలపై చర్చించారు. మంచినీటి సరఫరా, గ్రీన్ అంబాసిడర్‌లకు జీతాలకు సంబంధించి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పంచాయతీ కార్యదర్శి ఇందిరా, ఏపీవో భానుప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి "ప్రేరణ" కార్యక్రమంలో మండల విద్యార్థి

ప్రజాశక్తి-వరదయ్యపాళ్యం: గుజరాత్ రాష్ట్రంలోని వాద్‌నగర్‌లో జరిగిన జాతీయ స్థాయి ప్రేరణ కార్యక్రమంలో మండలానికి చెందిన విద్యార్థి ఝాన్సి పాల్గొన్నారు. గత నెల 23 నుంచి 29వరకూ ఈ కార్యక్రమం జరిగింది. ఝాన్సీ మండలంలోని సంత వేలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతోంది. కాగా ప్రేరణ కార్యక్రమానికి హాజరై రాష్ట్ర, జిల్లాకు సంబంధించి ప్రాముఖ్యతను వివరించారు. అదేవిధంగా బిఎన్ కండ్రిగ మండలంలోని ఏకలవ్య పాఠశాల నుంచి బాలుర విభాగంలో యువకిరణ్ నాయక్ పాల్గొన్నారు. వీరికి ఎస్కార్ట్ టీచర్‌గా తెలుగు ఉపాధ్యాయురాలు లతా వ్యవహరించారు. విద్యార్థి ఝాన్సీని బుధవారం పాఠశాల తరపున హెచ్‌ఎం మాధవయ్య, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

విద్యతోనే పేదరికం దూరం: కోటేశ్వర బాబు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: విద్యతోనే పేదరికం దూరం అవుతుందని ప్రముఖ సంఘ సేవకులు యల్లంపాటి కోటేశ్వరబాబు అన్నారు. మండలంలోని మంగళపురి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఆయన 75మంది విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఇందులో భాగంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలక, పెన్నులు, బలపాలు వంటివి అందజేశారు. ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో పేదరికం జయించాలంటే విద్యతోనే సాధ్యమవుతుందన్నారు. అందుకే గ్రామీణ ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులను మరింత ప్రోత్సహించాలనే ఆశయంతో తాను విద్యాసామగ్రి అందచేస్తున్నట్లు ఆయన చెప్పారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులకు విద్యా సామగ్రి అందచేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ బడుల్లో చదువుకునే విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు పోవాలన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు ఆదర్శనీయం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు ఆదర్శనీయమని బొజ్జల బృందమ్మ కొనియాడారు. హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రతిభావంతులకు బుధవారం 150వ నెల నిత్యావసర సరుకులు, దుప్పట్లు పూసలవీధిలో పంపిణీ చేశారు. కార్యక్రమానికి బృందమ్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ మునీర్ బాషా తనకు ఉన్నదానిలోనే పేదలకు సేవ చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తారన్నారు. ఇది చాలా గొప్ప విషయమన్నారు. హెల్పింగ్ హాండ్స్ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. తన వంతు సహాయంగా సంస్థకి ప్రతి నెల రూ.10వేలు ఆర్థికసాయం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగినేని చెంచయ్యానాయుడు, మైనారిటీ నాయకుడు షాకీర్ అలీ, హెల్పింగ్ హాండ్స్ సంస్థ సభ్యులు గరికపాటి రమేష్ బాబు, బాబా ఫరీద్, హరినాయుడు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో పరిశ్రమల స్థాపనకు తోడ్పాటునందించండి

కేంద్ర మంత్రికి చిత్తూరు ఎంపీ విజ్ఞప్తి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గాన్ని అన్ని రకాల అభివృద్ధి చేసేందుకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు తోడ్పాటును అందించాలని కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలశాఖ మంత్రి జితన్‌రామ్ మాంఝీకి చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పార్లమెంట్ సెషన్స్‌కు హాజరైన ఎంపీ బుధవారం దేశరాజధాని ఢిల్లీలోని కేంద్ర మంత్రి జితన్‌రామ్‌ని మర్యాద పూర్వకంగా కలిసి, చిత్తూరు ఉమ్మడి జిల్లా అభివృద్ధికి సహాయసహకారాలు అందించాలని కోరారు. జిల్లాలో ఎంఎస్‌ఎంఈలను స్థాపించం ద్వారా నిరుద్యోగ సమస్యకు పరిష్కారమార్గాన్ని చూపించిన వారవుతారని విన్నవించారు. చిత్తూరు పార్లమెంటుకు సంబంధించిన అనేక అంశాలను వివరించారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని చిత్తూరు పార్లమెంటు అభ్యున్నతికి తన వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారని ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దులో ఉండడంతో పాటు పలు పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణ పరిస్థితులున్న నేపథ్యంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటుకు సహకరించాలని కేంద్ర మంత్రికి విన్నవించినట్లు తెలిపారు. చిత్తూరు జిల్లాలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న గంగాధర్ నెల్లూరు నియోజకవర్గంలోని లెదర్ ఫ్యాక్టరీతోపాటు, నగిరి నియోజకవర్గంలో టెక్స్టైల్ పార్క్, కుప్పం, పలమనేరు ప్రాంతాల్లో గుజ్జు పరిశ్రమలు, కోల్డ్ స్టోరేజీల నిర్మాణాలను చేపట్టేందుకు సహకరించాలని కోరినట్లు వివరించారు. వీటి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేకమందికి ఉపాధి అవకాశాలు దక్కే అవకాశం ఉందని, కేంద్రమంత్రికి



వివరించినట్లు ఆయన తెలిపారు. కేంద్ర మంత్రి కూడా ఇందుకు సానుకూలంగానే స్పందించారని ఆయన వెల్లడించారు. చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో ప్రగతి పథం వైపు తీసుకెళ్లడమే తన ముందున్న ఏకైక లక్ష్యమన్నారు.

వైభవంగా నడివీధి గంగమ్మ జాతర

> సారె సమర్పించిన ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి-రామచంద్రాపురం(తిరువతి రూరల్): గంగమ్మ చల్లని చూపులు గ్రామానికి రక్షణగా వుంటాయని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ఓబీసీ రాష్ట్ర కన్వీనర్, పుదీపట్ల గ్రామపంచాయతీ సర్పంచ్ బడి సుధా యాదవ్ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే బుధవారం పుదిపట్లకు చేరుకున్నారు.



సాంప్రదాయ బద్ధంగా ఎమ్మెల్యే తలకు తలపాగా చుట్టి నడి వీధి గంగమ్మకు డప్పుల చప్పళ్ల మధ్య సారెను వూరేగింపుగా తీసుకొని వెళ్ళి జాతర నిర్వాహ కులకు సమర్పించారు. గంగమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఐదేళ్ల పాలనపై వాడి వేడి చర్చ

అన్ని శాఖల్లో అవినీతిని నిలదీసిన టిడిపి ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గత ఐదేళ్ల పాలనపై జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశంలో తెలుగుదేశం ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, పులివర్తి నాని, మురళీమోహన్, డాక్టర్ థామస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు అన్ని శాఖల్లోనూ అవినీతి చోటు చేసుకుందని, అభివృద్ధి ఏమాత్రం జరగలేదంటూ ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ నేతల ఒత్తిళ్లకు లోనై అధికారులు ప్రజాధనాన్ని వృధా చేయడంతో పాటు ఎక్కడ నిబంధనలు పాటించలేదన్నారు. బుధవారం జరిగిన జిల్లా పరిషత్ స్థాయి సమావేశంలో పదేపదే తెలుగుదేశం ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధికి తగిన ప్రాధాన్యతనిస్తుందని నిబంధనలు పాటించకుండా అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకుంటామంటూ అధికారుల హెచ్చరించారు. ఉదయం నుండి దాదాపు సాయంత్రం నాలుగు గంటల వరకు ప్రభుత్వ శాఖల పనితీరుపై వాడి వేడిగా చర్చించారు. సమావేశం ప్రారంభం కాగానే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చే సూచనలు సలహాలు తీసుకొని జడ్పీ ద్వారా అభివృద్ధి పనులు చెప్పటడం జరుగుతుందని జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక జడ్పీ సమావేశం హాల్‌లో జడ్పీ సీఈఓ గ్లోరియా, జడ్పీవైస్ చైర్‌పర్సన్ కుమారి రమ్య, స్త్రీ శిశు సంక్షేమ జడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ భారతిలతో కలసి జిల్లా ప్రజాపరిషత్ స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ముందుగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, జిల్లాలో ఎమ్మెల్యేలగా ఎన్నికైన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. జడ్పీ ద్వారా జిల్లాలోని 14 నియోజకవర్గాల అభివృద్ధికి మనందరం అన్నదమ్ములుగా కలసి పనిచేసి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే చిత్తూరు జిల్లాను మొదటి స్థానంలో నింపుటకు ఎమ్మెల్యేలు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూ ప్రజలకు ముఖ్యమైనవి రోడ్లు, తాగునీరు, డ్రైనేజి, వీధి లైట్లుపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నియోజకవర్గంలో అన్ని పంచాయతీలలోని వాటర్ ట్యాంక్‌లు పరిశీలించి, క్లినింగ్ చేయాలన్నారు. టిట్కో గృహాలు వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని గృహ నిర్మాణ సంస్థ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులు ఎమ్మెల్యేలకు సలహాలు సూచనలు ఇవ్వాలని, ఎమ్మెల్యే ఇచ్చే సలహాలు సూచనలు తీసుకోన్నపుడే ప్రజలకు మంచి జరిగే అవకాశం



మాట్లాడుతున్న జెడ్పి చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు

ఉందన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే కె.మురళీమోహన్ మాట్లాడుతూ గతం ప్రభుత్వంలో జడ్పీటీసీ సభ్యులకు ఎలాంటి గౌవరం లేదని జడ్పీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకురావడం చాలా బాధ కలిగిస్తుందన్నారు. ఈ ప్రభుత్వంలో అందరికి గౌరవం ఉంటుందని ఎమ్మెల్యేలుగా మీవెంట ఉండి అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరుగుతుందని తెలిపారు. పనులకు అంచనాలు, పనుల పురోగతి, పూర్తి అయ్యిన పనులకు సంబంధించి పూర్తి డేటా ఇవ్వాలని సంబంధించిన అధికారులను ఆదేశించారు. అర్హులైన వారికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఇవ్వాలన్నారు. నియోజకవర్గంలో రోడ్లు మరమ్మతులు చేపట్టాలని, కొన్ని గ్రామలలో గృహాలపై విద్యుత్ లైన్లు ఉండడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, తాగునీటి సమస్యలు వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాటిని వెంటనే పరిష్కరించాలని సంబందించిన అధికారులను ఆదేశించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట మునిప్రసాద్ (నాని) మాట్లాడుతూ నియోజకవర్గంలో గ్రామ సచివాలయలలో వ్యక్తి పేర్లు ఉన్నాయి వాటిని పరిశీలించి నివేదికను ఇవ్వాలన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలోని మండలంలో తాగునీటి సమస్య ఉందని అన్ని గ్రామాలు పరిశీలించి తాగునీటి సమస్యను పరిష్కరం చేయాలన్నారు. తాగునీటి సమస్య పరిష్కరానికి జడ్పీ నుండి నిధుల మంజూరు చేయాలని జడ్పీ చైర్మన్, సీఈఓ చూచించారు. నియోజకవర్గంలో పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, జలవనరులు, విద్యుత్, రహదారులు అండ్ భవనాలు, గృహ నిర్మాణం, శాఖ ద్వారా గత 5 సంవత్సరంలో జరిగిన పనులకు సంబంధించి పూర్తి డేటా అందజేయాలని సంబంధించిన అధికారులను ఆదేశించారు. జీడీ నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వియం థామస్ మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధులు మనందరం కలసి పనిచేసి జిల్లాను అభివృద్ధి చేద్దామన్నారు. తమకు ఎలాంటి కక్ష్య సాధింపులు ఉండవని, స్నేహపూర్వకంగా ప్రజలకు సేవచేయలన్నదే తమ లక్ష్యమన్నారు. ప్రజలకు మంచి ఆరోగ్యం అందించాలిని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్లు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఆదేశించారు. అర్హులకు పింఛన్లు, గృహాలు ఇవ్వకుండా, అనర్హులకు పింఛన్లు గృహాలు ఇవ్వడం జరిగిందని వీటిని పరిశీలించి నివేదికను అందజేయాలని, వివిధశాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతికి సంబంధించి పూర్తి వివరాలను అందజేయాలన్నారు. ఎన్టీఆర్ జలాశయం ద్వారా 33 చెరువులను అనుసంధానం చేసి నీటితో అన్ని చెరువులను నింపాలని, కృష్ణాపురం జలాశయా పూర్తి చేసి రైతులకు వ్యవసాయానికి నీరు ఇవ్వాలని జలవనరుల శాఖ ఎస్ఈని ఆదేశించారు. అధికారులు క్రమశిక్షణతో శుద్ధితో పని చేసి ప్రజల నుంచి ప్రశంసలు పొందాలని అధికారులకు చూచించారు. అధికారులను ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశం తమకు లేదని, ప్రజలకు మంచి జరగలన్నదే తమ ముఖ్య ఉద్దేశమని, ఎమ్మెల్యేలు అధికారులు అందరం కలిసి కట్టుగా ప్రజలకు పనిచేదామని ఎమ్మెల్యేలు జడ్పీ చైర్మన్‌కు జడ్పీటీసీ సభ్యులకు, అధికారులకు తెలియజేశారు. ఈ సమావేశంలో జడ్పీ చైర్మన్ జిల్లాలో ఎమ్మెల్యేలుగా ఎన్నికైన గౌరవ శాసన సభ్యులను శాలువలతో సన్మానించి పుష్పగుచ్చాలు అందజేశారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, జడ్పిటిసిలు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు